మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసిన మాధవరం కృష్ణారావు,అరెకపూడి గాంధీ



నిధులు మంజూరు చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి: రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సచివాలయంలో శనివారం రంగారెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజవకర్గంలోని చెరువుల్లో, కుంటల్లో పెరిగిపోయిన గుర్రపుడెక్క తొలగించాలని,దోమలను నివారించాలని, అన్ని డివిజన్‌లలో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, శానిటేషన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి రాజకీయాలకు అతీతంగా పనులు చేస్తామన్నారు. కార్యక్రమంలో బండారు లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, అరెకపూడి గాంధీ, మర్రి రాజశేఖర్, వివేకానంద పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో సహాయక బృందాలు రెడీ



ఈశ్వర్ విల్లాస్‌లో కాలనీ ప్రజలతో సమావేశమైన కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతకొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని ఈశ్వర్ విల్లాస్‌లో కాలనీ వాసులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. వరదనీరు చేరకుండా కార్పొరేషన్ అధికారులు మాన్‌సూన్ సిబ్బందిని నియమించారని, సమాచారం అందిన వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, సురేష్ రెడ్డి, మహిపాల్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కుమరన్ జ్యువెలర్స్‌లో ఎక్స్ఛేంజ్ మేళా



కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని ది చెన్నై సిల్క్స్ ఆవరణలోని శ్రీ కుమరన్ జ్యువెలర్స్‌లో ఎక్స్ఛేంజ్ మేళాలో పాల్గొన్న నిర్వాహకులు



మూసాపేట: కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని ది చెన్నై సిల్క్స్ ఆవరణలోని శ్రీ కుమరన్ జ్యువెలర్స్‌లో ఆషాఢమాసం సందర్భంగా ఎక్స్ఛేంజ్ మేళా శనివారం ప్రారంభమైందని నిర్వాహకులు పేర్కొన్నారు. ది చెన్నై సిల్క్స్‌లో ఆషాఢమాసం పురస్కరించుకొని వావ్ ప్రైస్, ప్రతి కొనుగోలుపై 5 నుంచి 50 శాతం వరకు డిస్కౌంట్, కాంబో ఆఫర్‌తో ట్రిపుల్ ఆఫర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి 2 వేల రూపాయల కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి ఇవ్వనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఆర్. మహేష్, బ్రాంచ్ మేనేజర్ ఆర్, శర్వణన్, రామకృష్ణ, మేనేజర్లు వినయ్, త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తూ.. ఆదేశాలిస్తూ...

- కూకట్‌పల్లిలో పలు ప్రాంతాలలో పర్యటించిన జెడ్‌సీ అపూర్వ చౌహాన్
- సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు



కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని సమస్యలను పరిశీలించిన జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, అధికారులు తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ శనివారం కూకట్‌పల్లిలో సుడిగాలి పర్యటనలు చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలిస్తూ, పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముందుగా మలేషియన్ టౌన్‌షిప్ నుంచి ఫ్లై ఓవర్ వరకు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లను వాడుకలోకి తీసుకువచ్చి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల మధ్య ఉన్న చెట్లను ట్రాన్స్ లోకేట్ చేయాలని యూబీడీ అధికారులను, రోడ్డు మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలను తరలించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు సూచించారు. రోడ్డు మధ్య ఉన్న తాగునీటి వాల్వ్‌ను త్వరగా తరలించాలని సూపరింటెండింగ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. అనంతరం రమ్యాగ్రౌండ్ వద్ద జీవీపీ పాయింట్‌ను పరిశీలించి చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. 15 రోజుల్లో జీవీపీలను తొలగించటానికి 15 రోజుల్లో చర్యలు తీసుకువాలని ఆదేశించారు. కూకట్‌పల్లి మెట్రో క్యాష్ అండ్ క్యారీ వెనుక వున్న ఇంటర్మీడియట్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను సందర్శించి సిమెంట్ ఫ్లోరింగ్ చేయాలని రాంకీ జెన్సీ వారిని ఆదేశించారు.

పరికి చెరువును పరిశీలించి...

షిరిడి సాయినగర్, గాజుల రామారంలో ఉన్న పరికి చెరువును పరిశీలించి దాన్ని తొలగించటానికి కావలసిన చర్యలు తీసుకోవాలని డీసీ, ఎంటమాజిస్ట్‌లను ఆదేశించారు. ఓక్షిత్ ఎన్‌క్లేవ్ వద్ద జరుగుతున్న బాక్స్ డ్రైన్ పనులను పరిశీలించారు. అనంతరం కాలనీ వాసులతో చర్చించి, పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కాలనీ వాసులకు డ్రైనేజీ కనెక్షన్, తాగునీటి కనెక్షన్‌లను పునరుద్ధరించాలని ఆదేశించారు. జగద్గిరిగుట్టలోని అతి పెద్ద ఇంటర్మీడియట్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించారు. అక్కడ జరిగే స్వచ్ఛ ఆటోల నుంచి వచ్చే చెత్తను పెద్ద లారీల్లో మార్చే విధానాన్ని పరిశీలించారు. పైపులైన్ రోడ్డులోని సీ అండ్ డి వేస్టును, గార్బేజ్‌ను వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన్నారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు రమేష్, మోహన్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణ, కిష్టప్ప, సహాయ వైద్యాధికారులు సాల్మన్ రాజు, మమత, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఎంటమాలజిస్టు సంధ్య, స్వప్న, ఏసీపీ మల్లేశ్వర్, రామ్‌కీ ఏజెన్సీ వారు పాల్గొన్నారు.



బాలానగర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



బాలానగర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ సురేష్ కుమార్ తదితరులు

బాలానగర్: బాలానగర్ పోలీస్ స్టేషన్‌ను డీసీపీ సురేష్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని ఫైళ్లను పరిశీలించి కేసుల వివరాలను సీఐ నవీన్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ సిబ్బంది ఫ్రెండ్లీ పోలీసులో భాగంగా ప్రజాపరిరక్షణకు పాటుపడాలని సూచించారు.

నివాళి

కూకట్‌పల్లి: శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం వివేకానందనగర్ కాలనీలోని పటేల్ కుంట పార్కులో ఆయన చిత్రపటానికి బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ నరేష్, బీజేపీ కార్యకర్తలు, నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్కులో మొక్కలు నాటారు.



పటేల్ కుంట పార్కులో మొక్కలు నాటిన నరేష్

బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి: నాగరాజు



వాడేపల్లి రాంచందర్‌ను కలిసిన కర్క నాగరాజు తదితరులు

కూకట్‌పల్లి: ప్రభుత్వరంగ సంస్థల్లో ఎస్‌సీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని జాతీయ ఎస్‌సీ కమిషన్ మెంబర్ వాడేపల్లి రాంచందర్‌కు గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేద్కర్ యుజన సంఘం అధ్యక్షుడు కర్క నాగరాజు శనివారం వినతిపత్రం అందజేశారు. స్పెషల్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. హెచ్‌ఏఎల్, బీహెచ్‌ఈఎల్, ఓడీఎఫ్, బీడీఎల్, మిథాని, ఈసీఐఎల్ వంటి సంస్థల్లో రోస్టర్ ప్రకారం ఎస్‌సీ, ఎస్‌టీ పదోన్నతుల్లో ప్రమోషన్లు, గ్రేడ్ వన్ ఆఫీసర్స్ పోస్టులను ఎస్సీ కార్మికులకు ఇవ్వడంలో యాజమాన్యాలు జాప్యం చేస్తున్నాయని వివరించారు. రాంచందర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ రంగ సంస్థల యాజమాన్యాలతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయకుమార్, ఉపాధ్యక్షులు బేగరి రాజు, కోశాధికారి బాపనపల్లి ప్రమోద్‌కుమార్, కార్యదర్శి అప్పలరాజు, పుణ్య భానుప్రకాష్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శులు శాత్తిరి వినయకుమార్, సదా మహేష్, కమల్, కర్క మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నవీన్‌గౌడ్

మోతీనగర్: జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్‌లో పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి సుదర్శన్, పద్మశాలి సంఘం అధ్యక్షులు ఉప్పల దామోదర్ గుప్త, మోతీనగర్ మాజీ ప్రధాన కార్యదర్శి సందీప్చ, వెంకట రామిరెడ్డి, సత్యనారాయణ, జిత్తు లాల్‌సింగ్, నాగరాజ్, నార్లపురం శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, కేఎస్ఎన్ మురళీమోహన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్ఎంటీ శాతవాహననగర్‌లో..

ఆల్విన్‌కాలనీ: త్యాగశీలి డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి పక్షోత్సవాలను శనివారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో హెచ్ఎంటీ శాతవాహననగర్‌లో డివిజన్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేవైఎం మాజీ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, అసెంబ్లీ ఓబీసీ కన్వీనర్ శేషయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, నాయకులు కోటేశ్వరరావు, బాలాజీ, నర్సింగ్, కరుణాకర్, సైదమ్మ, కరుణాకర్, ప్రసాద్, మహేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.



శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పించిన నాయకులు

కలుషిత నీటి సరఫరా

డయేరియా, జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి డివిజన్‌ల పరిధిలో తాగునీటి పైపులైన్ లీకేజీలతో మంచినీటిలో మురుగునీరు కలిసి కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని స్థానిక కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడపాదడపా వర్షాలు కురుస్తుండడం వాతావరణంలో మార్పు రావడంతో జ్వరాల బారిన పడుతున్నారు. దీనికి తోడు కలుషిత నీటితో డయేరియా వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వం కారణంగా ప్రతి కాలనీలో మంచినీటి పైపులైన్‌లు, వాల్వ్‌లు లీకేజీలతో కలుషిత నీరు సరఫరా అవటంతో నిత్యావసరాలకు కూడా నీరు వాడుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.

మురుగునీరు ఏరులై పారుతుండటంతో స్థానికులు వాటర్‌వర్క్స్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా మరమ్మతులు చేసిపోతున్నారని సమస్య పునరావృతమవుతోందని మండిపడుతున్నారు. సరఫరా అవుతున్న నీటిలో చెత్తా, చెదారం వస్తోందని నీరు దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. బోర్లు లేని వారు జీహెచ్‌యంసి సరఫరా చేసే నీటిపై ఆధారపడ్డ వారు నీరు లేక అలమటించాల్సి వస్తున్నదని పేర్కొంటున్నారు. అపరిశుభ్ర జలాలతో అనారోగ్యం కలుగుతోందని, చాలీ చాలని జీతాలతో ఆసుపత్రుల పాలైతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివేకానందనగర్ డివిజన్ రిక్షాపుల్లర్స్ కాలనీ ప్రధాన రహదారి, పీజేఆర్ విగ్రహం వద్ద తాగునీటి వాల్వ్ లీకేజీతో తాగునీరు ఏరులై పారుతోంది. జగద్గిరిగుట్ట ఇందిరా గాంధీ విగ్రహం నుంచి కూకట్‌పల్లికు వెళ్లే రహదారిలోని పీజేఆర్ ఫంక్షన్ హాలు సమీపంలో ప్రధాన రహదారిలో మంచినీటి వాల్వ్‌లు లీకై కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. ఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డులోని బ్రిడ్జికి ఆనుకొని ఉన్న త్రాగునీరు సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్ లీకేజి అయి చెత్తా చెదారం చేరి మురుగునీరు సరఫరా అవుతోంది. భాగ్యనగర్‌కాలనీలోని గోవిందు హోటల్ చౌరస్తాలోను కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. ఈ విధంగా పలు ప్రాంతాల్లో కలుషిత నీరు వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు శిధిలావస్థకు చేరిన పైపులైన్లు, వాల్వ్‌లు తొలగించి నూతన పైపులైన్లు, వాల్వ్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.





జగద్గిరిగుట్ట నుంచి కూకట్‌పల్లి దారిలోని పీజేఆర్ ఫంక్షన్ హాలు సమీపంలో..





రిక్షాపుల్లర్స్ కాలనీలోని పీజేఆర్ విగ్రహం వద్ద లీకవుతున్న మంచినీరు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన బండి రమేష్ తదితరులు

బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి

ఆల్విన్‌కాలనీ: స్వేచ్ఛ, మానత్వం, సామాజిక న్యాయంపై దేశప్రజలను చైతన్యవంతం చేసిన డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆల్విన్ కాలనీ డివిజన్ పీజేఆర్ నగర్‌లో డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్, డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను పుష్పమాలతో సన్మానించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీహెచ్ భాస్కర్, బాలస్వామి, అగ్ర వాసు, మహేష్, జనార్దన్, కె.శ్రీనివాస్, అజామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళులు

బాలానగర్: దళిత బహుజనుల అభివృద్ధికి విశేష కృషి చేసిన చేసిన వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా బాలానగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పుష్పారెడ్డి, శ్రీకాంత్, ప్రసన్న కుమార్, అస్లాం, అరుణ్, భరత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన వెంకటేష్‌గౌడ్

ఉపాధ్యాయులకు సన్మానం

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు



ఉపాధ్యాయులను సన్మానించిన రామకృష్ణగౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని ఎంపీపీఎస్, జెడ్‌పీహెచ్ఎస్‌ల నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు, అభినందన సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శివరాజు గౌడ్, సీహెచ్ భాస్కర్, పాండుగౌడ్, షౌకత్‌అలీ మున్నా, సయ్యద్, మహస్తష్, ఫారూఖ్, ఖలీమ్, బషీర్, జనార్దన్, ఉపాధ్యాయ సిబ్బంది రాధపద్మజ, గోవింద్, కె.కె.మోహన్‌రావు, లక్ష్మప్ప, సిద్ధయ్య, పాండు, విఠల్ గౌడ్, కిరణ్మయి, సంధ్యారాణి, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తొలిబోనం పాటల సీడీ ఆవిష్కరణ



తొలి బోనం పాటల సీడీని ఆవిష్కరించిన మిట్టపల్లి సురేందర్

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల నుంచి పుట్టినదే తెలంగాణ బోనాల పండుగ పాటలు అని ప్రముఖకవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్ అన్నారు. శనివారం శ్రీ సాయి అలేఖ్య సేవా సంస్థ వ్యవస్థాపకురాలు అరుణాఅశోక్ రూపొందించిన తొలి బోనం వీడియో పాటల సీడీని కూకట్‌పల్లిలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శ్రీ సాయి అలేఖ్య సంఘ సేవాసంస్థ పేదలకు, ఆపదలో ఉన్నవారికి, నిరుపేద విద్యార్థులకు సేవ చేయడంతోపాటు తెలంగాణ సంప్రదాయాలను వెలికితీయడంతో తనవంతు కృషి చేయటం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అరుణాఅశోక్, రవి, అరుణ్ తదితరులు ఉన్నారు.

భాష్యం పాఠశాలలో ఫ్రెషర్స్ డే



భాష్యం పాఠశాలలో ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లోని భాష్యం పాఠశాలలో విద్యార్థులు శనివారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జెడ్ఈఓ శిరీష, ప్రిన్సిపాల్స్ శ్రీదేవి, యమున ప్రారంభించారు. విద్యార్థులు ఆట, పాటలతో, స్కిట్స్‌తో ఎంతగానో అలరించారు. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి అనుభవాలను పంచుకున్నారు.

ప్రారంభమైన పీజీ ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ఎనిమిది వర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం ఓయూ క్యాంపస్‌లోని ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో ఉదయం రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రి ఎకనామిక్స్ ప్రశ్నపత్రం కోడ్‌ను పారంభించారు. తొలిరోజు ఎంఏ తెలుగు, ఎకనామిక్స్, ఎమ్మెస్సీ సైకాలజీ, డాటా సైన్స్ కోర్సుల ప్రవేశ పరీక్షలకు 87.17 శాతం మంది హాజరైనట్లు టీఎస్ సీపీజీఈటీ-2024 కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు. నేడు జరగాల్సిన ఎంఈడీ ప్రవేశ పరీక్షను 16కు వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: 2024 సంవత్సరంలో అడ్మిషన్లకు సంబంధించి విదేశీ విశ్వవిద్యాలయాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, డాక్టోరల్ కోర్సులను అభ్యసించడానికి సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ఆర్థిక సహాయం మంజూరు కోసం అర్హత కలిగిన మైనారిటీ విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కేశురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ విశ్వవిద్యాలయాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ / డాక్టోరల్ కోర్సులలో జనవరి 2024 నుంచి జులై వరకు ప్రవేశం పొంది ఉండి,అన్నీ అర్హతలు కలిగి ఉన్నవారు మాత్రమే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9492037940/ 9000168256 నెంబర్లకు ఫోన్‌చేయాలన్నారు.

హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులకు అవార్డులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ పూర్వ విద్యార్థులు మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి ఏటీజీసీ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ డాక్టర్ మార్కండేయ గోరంట్ల, ఏటీజీసీ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ విబిరెడ్డి ఇద్దరు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ద్వారా సైన్స్, ఇంజనీరింగ్‌లో ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు. వీరిద్దరు నిజాం కళాశాల, హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులు. హెచ్‌సీయూ నుంచి ప్లాంట్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేసిన డాక్టర్ గోరంట్ల మార్కండేయ, వ్యవసాయ బయోటెక్నాలజీలో డాక్టర్ విబిరెడ్డి అద్భుతమైన పనికి గుర్తింపుగా ఈ అవార్డును పొందారు. ఏటీజీసీ బయోటెక్‌లో డాక్టర్ గోరంట్ల, డాక్టర్ విబిరెడ్డి ఇద్దరు ప్రొఫెసర్ అర్జుల ఆర్ రెడ్డితో కలిసి పురుగు మందులు లేని ప్రపంచ దృక్పథాన్ని ప్రతిబింబించారు. వారిద్దరిని హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, అధికారులు అభినందించారు.